పోనిష్టి భోలోం

టి.వి. శంకరమ్

శ్రీమంతం ఫస్టుగా జరిగింది. సోమిదేవీ, చిత్తుగాడూ వచ్చారు. రోజల్లా ఉన్నారు. ఎదురు వాకిలే అయినప్పటికీ నున్నూ అల్లుడు భద్రాచలం తొంగి చూశాడుకాదవటాని సీతప్పగారు కాస్త ఇదయాడు.

"పార్వతి అయినా వొచ్చుండవలిసింది. పరాయిదా, యేవిటి ?" అన్నది రావమ్మ, తన కూతురిసవితి గురించి.

"ఇదుగో, నే చెబుతున్నా వినూ. ఎవరిష్టం వారిదీ. ఒహరు చెప్పినట్టొహరు వినే రోజులు పోయాయి. అబ్బో, మా చిన్నతనంలోనా ? పెద్దవాళ్ళు కూచోమంటే కూచోవాలిసిందే, నుంచోమంటే నుంచోవలిసిందే. పకడ్బందీ! అంతా కామోష్! ఆఁ!" అన్నాడు సీతప్ప కళ్ళు పెద్దవిచేసి.

మరొకందుకు కూడా సీతప్ప ఆనందం వెలిబుచ్చాడు — సత్యం బావమరిది నరుసు సరిగ్గా నెలంటే నెలకిందటే ప్రెస్సు కూడా పెట్టేశాట్ట. ఈమాట వింటూనే సీతప్ప తన వియ్యంకుడైన సీతాపతిగారితో, "యేవిటీ ? చెప్పారుకారేం ? మీవాడి పుస్తకాలు అచ్చు వేసుకుందుకేనా ? ఆ బిజినెసు బాగా సాగుతోంది గదా! మరి ప్రెస్సుతోబాటు కంపోజర్లనూ, స్ట్రియికర్లనూ కూడా ఏర్పాటు చేసుకున్నారు గదా! మరిహనేం ? అంతా సవ్యంగానే వెళ్ళమారిపోతుంది. పుస్తకాలు ఇలా అచ్చేస్తూండడమూ, అలా మార్కెటుకు తోలేస్తూండటమూనూ. దొంతర్లు, దొంతర్లు! ఊపిరి సలపదు! విసుగూ విరామవూ వుండదనుకోండీ! నే చెప్పాగా! అ బ్బో!"
అన్నాడు.

"ప్రెస్సు సౌకర్యంకోసం పెట్టడమేగాని, అందులో మనకు చాలా —" అని సీతాపతిగారన్నాడు.

"మెల్లిగా అంటారేవిటి ? సౌకర్యవా, సౌకర్యవా ? అడక్కండి! ఇహ బండి మీరాపినా ఆగదు. అసలు మా సత్తెం మీ ఇంటో అడుగుపెట్టడవే వ్యవధిగా సిరెత్తుకుందనుకోండి. అప్పుడేగాదూ మీవాడు పుస్తకాల బిజినెసు పెడతా ? ఇప్పుడు ఓ నలుసు కడుపున పడిందో లేదో ప్రెస్ పెట్టేశారు! ఇంకేవుందీ ? రేపా నలుసు బయటికి వచ్చాక, చూడండి, అసలైన దశ అందుకుంటుంది. మీరే ఆశ్చర్యపోతారు, ఇంత అదృష్టం ఎలా వచ్చింది చెప్మా అని!"

సీతప్ప ఒక్క అరసెకండుకాలంలో తమ వంశచరిత్ర అంతా పర్యాలోకన చేసి చూసుకున్నాడు — అత్తవార్లకి అదృష్టం పట్టించే ఆనవాయితీ తమ వంశంలోనే ఉందని రుజూచెయ్యడాని కేమన్నా ఆధారాలు దొరుకుతాయా అని. అయితే ఈ ప్రయత్నానికి అడుగులోనే హంసపాదు పడింది. సీతప్ప పెళ్ళయిన పదహారోరోజు పండగనాడు ఆయన మామగారు హరీ అన్నాడు — సత్యం పుట్టిన మూడోనాడు ఆ మిగిలిన ముసలావిడ ప్రాణంకూడా గుటుక్కు మనేసింది; "ఛస్!" అనుకుని సీతప్ప ఆ ఆలోచనకి ఆనకట్ట వేసేశాడు...

సత్యం తల్లితో రహస్యంగా చెప్పాడు: "చూడమ్మా, దాని కక్కడుపైతే తిరపతి వెళతానని మొక్కుకున్నాను. ఈ మాట దాంతో అంటే నవ్వి వేళాకోళం చేసింది. ఆ మొక్కు తీరే దెలాగమ్మా ?"

"మా నాయినే! నా తండ్రే! మీ నాన్నరితో చెప్పి ఏదో ఉపాయం చేయిస్తాలే" అన్నది రావమ్మ.

ఆవిడ ఈ మాట రహస్యంగా సీతప్ప చెవిని వేసింది. సీతప్ప దారుణమైన వార్త విన్నవాడల్లే, "హయ్యో, హయ్యో! మొక్కేసుకున్నాడా ? అలాటి పని చేసేప్పుడు కాస్త వెనకా ముందు ఆలోచించుకు మరీ చెయ్యాలి. పత్రం మీద సంతకం పెట్టాలంటే పదిసార్లు పైకీ కిందికీ పారచదువుతాం గదా....అందులోనూ ఇది దేవుడితో సంబంధించిన విషయవే తప్పవిడిచి మరొహటీ మరొహటీ కాదు కూడా నాయిరి! దేవుడి మనస్తత్వం ఎలాటి దంటే — మొక్కొకు! గమ్మునుండిపో! నిన్నేవీ అనడు! కాదని మొక్కున్నావూ ? నీవెంటబడతాడు—నిన్ను వొదల్డు మొక్కు చెల్లించేదాకానున్నూ! నేను రామకోటి ప్రారంభించానా ? రాసుకుపోవలిస్సిందేనూ! పోనీలే మా నే స్తాం అనుకునేటందుకు వీల్లేదు! అది అయేపని కాదంతే!" అనే ధోరణిలో పడిపోయి అసలు సంగతి మరిచాడు.

"ఇప్పుడబ్బిగా దేంచేసేట్టూ ?" అన్నది రావమ్మ.

"నువు కంగారు పడకు ! నేనంతా సరి చేసేస్తాను."

సీతప్ప దీర్ఘంగా ఆలోచించి, "వియ్యంకుడుగారితో చెబితేనో ?" అన్నాడు.

రావమ్మ అటుచూసి గొంతు తగ్గించి, "వీళ్ళంతా వొట్టి రాలుగాయలు సుమండీ ! ఒకదేవుడూ దైవమూ లేదు ! ఒకమడీ ఆచారమూ లేదు ! అడక్కండి !" అన్నది.

"అదా సంగతీ......పోనీ మనవెంట కోడల్ని తీసికెళ్ళి నాల్రోజుల పాటు అట్టే పెట్టుకుంటావందాం. పట్నంనుంచి తిరుపతనగా యెంత ? బస్సులు కొల్లలు కొల్లలు! వచ్చే బస్సూ, పోయే బస్సున్నూ. ఇక్కడెక్కడం, అక్కడ వాలడమూనూ !"

రావమ్మ మొహం చాటంతయింది.

"మంచి ఆలోచన చెప్పారండీ. రెండేళ్ళయి కోడల్ని తీసుకు రాకనే పోతిమి. అందరూ వింతగా అడుగుతున్నారు. ఈపంజేస్తివా(, కోడల్ని తీసుకొచ్చినట్టూ అవుతుంది. అలావెళ్ళి ఆ కాస్త మొక్కూ తీర్చేసుకున్నట్టూ అవుతుంది. దివ్యమైన ఉపాయంలెండి మరి !"

భార్య తనను అంతగా మెచ్చుకున్నందుకు సీతప్ప పరవశుడైపోయాడు. "ఈ భాగ్యానికేనా ?" అన్న మొహం పెట్టి, కీడెంచి మేలెంచేవాడి వాలకంతో, "అప్పుడే సంతోషించకు మరీ! మనం అడగ్గానే వారు పంపుతారనేవిటీ ? వారికిన్నీ ఇద్దరు కుమార్తెల తరువాత ఒకే ఒక కూతురాయిరి ! అందులోనూ చూలాలూ ! ఇప్పుడుగాదు లెండి. అవతల చూస్తాం ఆవటాని మాటతప్పించేశారో మనపని ఖాళీయే. వారిని ఒప్పించే వాడుపూ, చాకచక్యమూ నీలోవుంది ! ఆ(!" అన్నాడు.

"నేను అడగవలిసిన విధంగానే అడుగుతా ననుకోండీ. అయినా మనసోమిదేవి చేతకూడా చెప్పించి చూస్తానూ ! వీరి దగ్గిర అమ్మికి ఎంతో చనువు. అదేగదటండీ అబ్బిగాడి కీ సమ్మంధం కుదిర్చి పెళ్ళి చేయిస్తా? సీతారత్నంమాట చెప్పే అక్కర్లేదూ! సోమిదేవి కూచోమంటే కూచుంటుంది, నుంచోమంటే నుంచుంటుంది. మన కోడలికి రావాలనే ఇచ్ఛ కలిగాక పెద్దవాళ్ళ అడ్డు పుల్లేస్తా రనుకోనుస్మండీ !...... అన్నట్టు అమ్మనీ, చిత్తుగాణ్ణీకూడా తోలుకుపోదా(వా ఏవిటి, పన్లోపనిగా ?" అన్నది.

సీతప్ప బెదురుగొడ్డల్లే అయిపోయి నోరు నొక్కుకుని, "ఇంకా నయం ! ఇప్పుడున్న పరిస్థితిలో దాన్ని ఆ యింటి గడప దాటి యివతలికి రానియ్యడవా ? నా మొదటి భార్య పిల్లడితో లేచిపోయింది అని భద్రాచలం కోర్టులో చిన్న కాగితంముక్క పడేశాడంటే దానికి పుట్టగతు లుంటాయా ? ఈ పదేళ్ళనుంచీ దాన్ని పిలిచి ఇంత కుంకం బొట్టయినా పెట్టాం కాం గదా ! అపేక్ష లేకేనా ? నీ కీ ఆలోచన రావడమే పొరబాటు. అందుకేగా స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః అన్నారు." అన్నాడు.

రావమ్మ తప్పు గ్రహించి తన సవరణ ఉపసంహరించేసుకుంది.

ఆ పుణ్యదంపతులు ఉత్తినే కంగారు పడ్డారుగాని, రావమ్మ అడగ్గానే వియ్యాలవారు, "మీ కోడల్ని మీరు మహరాజులా తీసుకుపొండి. నాల్రోజు లుంచుకుని మళ్ళీ పంపెయ్యండి." అన్నారు.

2

సీతారత్నం సెంట్రలు స్టేషను బయటికి వస్తూనే ఒక కన్ను జనరల్ ఆస్పత్రికేసీ, ఇంకో కన్ను రిప్పన్ బిల్డింగ్ కేసీ వేసి, "ఇదేనా మెడ్రాసు ? ఏం ఊరు, పాడూరు ! పేరు గొప్పా, ఊరు దిబ్బానూ !" అనేసింది.

అత్తవారి గడపదాటి లోపలి కడుగు పెడుతూనే, "ఏం కొంప ? పాడు కొంప !" అనేసింది. తమిళ భాషను, "ఏం భాష ? పాడు భాష !" అని దీవించింది. అన్నిటికీ సత్యం అవు నన్నాడు. సీతారత్నం తన మామగార్ని, "ఏం మనిషి ? పాడు మనిషి !" అని పైకి అనలేదు గాని లోపల అనుకున్నది.

రైల్లోనూ, రైలు దిగి ఇంటికి వచ్చేటప్పుడు పెద్ద టాక్సీలోనూ సీతప్ప చెవి కోసిన నక్కలాగా మాట్లాడుతూనే ఉన్నాడు. కాని ఆయన ఏమంటున్నాడో, ఎందు కంటున్నాడో సీతారత్నానికి వచ్చినా బోధపళ్లేదు.

"పట్నం నిండా వట్టి రౌడీ వెధవలు ! ఒంటరి పిల్ల కనిపిస్తేచాలు ఎగరేసుకు చక్కాపోతారు. యీడొచ్చిన ఆడపిల్లలు పట్టపగలు గూడా ఒంటిగా పోభయం. రిక్షావాళ్ళకి డబ్బిచ్చేసి, 'అబ్బీ, నదరైన పిల్ల నీ రిక్షాలో ఎక్కిందో తిన్నగా మనింటికి పట్టుకొచ్చెయ్యి !' అని చెప్పుంచుతారు. వాళ్ళ కస్తమానూ అదే యావాయిరి. కాని కొందరు పిల్లలు సాహసం గలవాళ్ళుంటారు. కనిపెట్టేస్తారు. తిన్నగా లజ్ కేసి పోవలిసిన వాడు ఇలా కెనెడీ వీధికేసి రిక్షా తిప్పావేవిటి చెప్మా అనుకుంటారు. అనుకుని ఆపళంగా, 'ఒరే, ఇటుగాదు ! తిన్నగా రిక్షా తోలు ! వెర్రిమొర్రి వేషా లేశావో పెణత ఊడిపోగలదు,' అవటానేస్తారు. దాంతో రిక్షావాడు దారికొస్తాడూ సరేసరి, లేదూ ఆపళం కాలి జోడూడదీసి నాలు గుచ్చుకుంటారు. ఆ పళంగా నలుగురూ పోగవుతారు. ఆపళంగా రిక్షావాడికి మరి నాలుగు తగుల్తాయి. అమ్మో !...అప్పుడే వెల్లింగ్టను కొచ్చేశామా? వేగిరం, వేగిరం!...పట్నంలో అన్ని సౌకర్యాలూ ఉన్నాయన్నమాటేగాని ఏ సౌకర్యమూ లేనట్టే. అవును మరి వెలు గుండే చోటే నీడా ఉంటుంది. కష్టసుఖాలు కావడి కుండలని ఊరికే అన్నారా. ఓడలు బళ్ళూ, బళ్ళు ఓడలూ నాయిరి. చెప్పొచ్చిం దేవంటే, ఎలెక్ట్రిసిటీ ఉందా ? ఉన్నట్టుండి గభాల్న దీపాలారి పోతాయి. ఎంతకీ రావు. మీ అత్తయ్య అన్నం వొండుతూ ఉంటుంది. ఉడుకెందాకా వచ్చిందీ తెలీదు. ఎలెక్ట్రిసిటీ ఉందిగదావటాని కిరసనాయిలు దీపాలు లేకుండా చేసేసుకుంటాం. నా చిన్నప్పుడు మా అమ్మమ్మగారింటో ఆవదం దీపాలు. ఒకవేళ దారితప్పి దీపం ఆరిపోయినా అంత చీకటనిపించేది కాదు. ఎంచేతా ? ఆవదం

దీపంది అసలే గుడ్డి వెలుగు. కాని ఇప్పుడీ ఎలెక్ట్రీ దీపాలు కళ్ళు జిగేల్మనేలా వెలుగుతాయేం, అవి ఆరిపోయేసరికి కన్ను పోయినంతలా ఉంటుంది. ఏవీ కనిపించదనుకో. అందుకే, కష్టపడి సుఖపడు గాని సుఖపడి కష్టపడొద్దన్నారు... వచ్చేశావ ర్రోయ్! వేగిరం, వేగిరం!''

ఆహా, తన మామగారెంత లోకజ్ఞాని, ఎంత అనుభవజ్ఞుడు. అలాటివాడింటో ఉంటే చిన్నవాళ్ళకెంత జ్ఞానవృద్ధి అని కోడలు అనుకోవాలని సీతప్ప ఆశయం; అనుకుంటున్నదని సీతప్ప నమ్మకం.

"అదేనోయ్ యిల్లూ! అల్ల ఆకుపచ్చ రంగుగేటుంది చూడూ, ఆగేముందు నిలు!.. ఓపలేందానవు, కాస్త నింపాదిగా దిగమ్మా!" అన్నాడు సీతప్ప టాక్సీవాడితోనూ, కోడలితోనూ.

మావగారెవడు చెప్పటానికన్నట్టుగా సీతారత్నం పెద్ద అంగ వేసి టాక్సీలోంచి ఏకంగా గేటుదగ్గిరికి దూకింది. ''ఆఁ! ఆఁ?" అన్నాడు సీతప్ప.

టాక్సీమీటరు నాలుగురూపాయిల నాలుగణాలయింది. "అమ్మబాబోయ్! మీటరులో తభావతులేదుగదా. కిందటిమారు రెండు రూపాయిల చిల్లరేఅయినట్టు జ్ఞాపకమే?'' అన్నాడు సీతప్ప వణుకుతున్న చేత్తో సంచీ తెరుస్తూ.

తెలుగురాకనో, ఈపిచ్చి బ్రాహ్మణుడికి జవాబుచెప్పే దేవిర్లే అనో టాక్సీవాడు మాటాపలుకూలేక, మీటరుమీద చెయ్యిపెట్టి ఓర్పుగా డబ్బుకోసం నిలబడ్డాడు.

''అది చిన్న టాక్సీలెండి,'' అన్నది రావమ్మగారు.

"అవునే వన్నట్టు!'' అంటూ సీతప్ప ఆదరాబాదరా డబ్బులుతీసి టాక్సీవాడికిస్తూ, ''ఎంతెంత డబ్బూ టాక్సీలకింద తగులబడిపోతోంది! వేలూ లక్షలూ సంపాయించుగాక టాక్సీలెక్కావో నీపని ఖాళీయే,'' అని గొణుక్కున్నాడు.



"వెధవ ఇప్పటికి మూడుపెళ్ళిళ్లు చేసుకొన్నాడు ఇంకా ప్రేమ వెలగబెడుతున్నాడట ప్రేమ!"

"గత్యంతరం లేదాయిరి! ఇంత సామానుతో బస్సువాడెక్కించుకోడుగదా! అప్పటికీ బయల్దేరేటప్పుడు చెప్పా — నాలుగు రోజులుండటానికి ఇన్ని పెట్టెలెందుకే మాతల్లీ? ఒకట్రెండు చీరెలెత్తుకుంటే అంతగా అవసరంపడ్డప్పుడు నా చీరెలిస్తానూ అని! వింటిగాదుమరి," అన్నది రావమ్మ కోడల్నిగురించి.

అకస్మాత్తుగాకోడలుపిల్ల అగ్గయిపోయి, "ఛీ, ఛీ! ఒకరిచీరె కట్టటం మా కింటా వంటా లేదు. మా అమ్ముంది. అక్కాయిలున్నారు. చచ్చి గీపెట్టినా, పీకతెగ్గోసినా ఒకరిబట్టలొకరు కట్టుకోం. అది యేబ్రాసివాళ్ళు చేసేపని! నాకేంలోసుగూ? నాల్రోజులుండటానికి నాలుగు పెట్టెలు తెచ్చుకుంటాను. నాకు అన్నీ అమరిగ్గా ఉండాలి. ఏది తక్కువైనా రెక్కపడిపోయినట్టవుతుంది. నన్నొట్టేరొకాయించకండి. చిర్రెత్తితే నేనసలు మంచిదాన్నిగాను!'' అని దడాబడా అప్పగించేసింది.

ఇంకా వీధిగుమ్మం దాటి లోపలికి వెళ్ళకముందే కోడలిలా మూడోకన్ను విప్పడంచూసి సీతప్ప బెంబేలుపడిపోయాడు. రావమ్మ అవమానంతో మొహం కందగడ్డ చేసుకున్నది. సత్యం నేలకేసిచూసి కుడిచేత్తో ఎడంచెవి నులుముకున్నాడు.

''ఎందుకీ నిలువుజీతం? తాళం తెరవండి. దూరభార ప్రయాణంచేసి ఒళ్ళంతా హూనమైపోయింది. ఉడుకునీళ్ళోసుకుని నడుం వాలిస్తేతప్ప ప్రాణం కుదుటబడదు,'' అని సీతారత్నం తొందర పెట్టింది.

పాపం, రావమ్మగారిని ఆటలో పెద్ద పాపము కరచినట్టుగా అయిపోయింది. ఆవిడ ఇంత కాలమూ తన కోడలెలాటిదో ఎరుగదు. ఎరగని మనిషి ఎరగనట్టూరుకోక మనుషులు దేవుణ్ణి తమరూపులో చిత్రించుకున్నవతుగా, తనక్కావలసిన లాంటి కోడల్ని ఊహించుకుంది. ఆకోడలు ఆప్యాయంగా తనయింట కొన్నాళ్ళుండి — ఎల్లకాలం ఉండమంటే మాత్రం ఉంటారా ఏవిటి? — "అత్తయ్యా, మీరు కాస్సేపు విశ్రాంతితీసుకోండి. చెయ్యవలసినపనులేవో నేను తీర్చి దిద్దుతాగదూ? ఇంత కాలమూ తప్పలేదుగనక అంతా మీరేచేసుకుంటూ వచ్చారు; ఇప్పుడు మరి నేనంటూ ఒకతెనున్నానుగదా సమస్తోపచారాలూ చెయ్యడానికి!'' అంటుం దవటాని ఊహించుకుంది. కాని, సినిమాల్లో ఒక బొమ్మపోయి

ఇంకేదోబొమ్మ వచ్చినట్టుగా తా ననుకున్న కోడలు మాయమై ఇదేదో విచిత్రమైన మనిషి తయారయింది. ముచ్చటగా తనని "అత్తయ్యా", అనీ, ఆయన్ని "మావగారూ" అని నోటంట పిలిచిన పాపాన పోయిందేగాదు ! తనని ఫేడీమనీ ఏబ్రాసి అని ఆ పిల్ల అంటూంటే తనభర్త చక్రం అడ్డేస్తాడని రావమ్మగారు ఎంతో ఆశపడి ఆయనకేసి చూసింది. కాని సీతప్ప కంటిలో బెదురు చూడగానే ఆ ఆశకూడా అడుగంటి పోయింది.

ఇంతదాకా వచ్చాక ఇంకో అత్తగారైతే, "ఈ ముండని ఎలా రాచి రంపాన పెట్టడమా !" అన్న ఆలోచనలో పడేది. కాని సీతప్పగారి కుటుంబంలో అలాటి ఆనవాయితీలేదు. ఎవరైనా కరుకుగా ప్రవర్తిస్తే వారిని మెప్పించడానికి అష్ట కష్టాలూ పడడమే ఈ కుటుంబంవారికి తెలిసిన తారక మంత్రం.

సీతప్పకూడా కోడలిమెప్పు సంపాదించే యత్నంలోనే ఉన్నట్టు త్వరలోనే తేలిపోయింది. రావమ్మగారు కాగుకింద రెండు కట్టెలుపెట్టి మండిస్తూంటే ఆయన దొడ్లోకి వచ్చి, "ఏమేవ్ ? వేగిరం. వేగిరం !" అన్నాడు.

అలవాటు చొప్పున రావమ్మ, "అయిపోయింది ! అయిపోయింది !" అన్నది.

సీతప్ప కాగులో చెయ్యిపెట్టి చూసి, "ఏదీ ఇంకా గోరువెచ్చలుకూడా కాలేదే ?" అన్నాడు.

"అయ్యో, రామా ! ఇప్పుడే గదండి మంటచేస్తా ? కాగుడునీళ్ళు ఇంతలోకే తెర్లిపోతాయా ? మరీచోద్యం !" అన్నది.

"మరెండు కట్టెలు పెట్టకూడదూ ? నలుగురమూ స్నానంచెయ్యవలసిన వాళ్ళమే నాయిరీ ! ఆ పిల్ల — అసలే ఓపలేని మనిషి — మసుళ్ళు కావాలంటుందాయిరీ ! మనకే ప్రయాణబ్బడలిక యింతగా ఉంటే ఆరోనెలగర్భిణి కింకెంత బడలిగ్గా ఉండొచ్చు !"

రావమ్మగొంతు తగ్గించి, "నెలలొచ్చిన మనిషిగదా, ఉడుకునీళ్ళోసు కుంటానంటుం దేవిటండీ ? మీరన్నా కాస్తచెబుదురూ !" అన్నది.

"నువ్వూరుకో ! నీకీ వైనాలు తెలీవు. మనం చెప్పేకూడదు. మాటవరసకి, 'అమ్మాయీ, ఉడుకునీళ్ళు ఉత్తప్పుడైతే పోసుకుంటే పోసుకోగాక, ఈ స్థితిలో — గర్భాన ఆరునెలల పిల్లడుండగా అలాటి పన్లు చెయ్యరాదు. అది నీగ్గాని, నీ కడుపులో ఉండే పిల్లడిగ్గాని మంచిదిగాదు !' అని మనం అన్నావన్నట్టాయినా, 'హాత్తెరీ, నన్ను తీసుకొచ్చి కోరంటికం పెట్టేస్తున్నారు;' అవటానుకుంటుంది. నే నొక్కటే చెబుతా. చూడు ! జరగవలసిందేదో జరిగిపోనీ ! అన్నిటికీ ఆ శ్రీరామచంద్రమూర్తే ఉన్నాడు. హరిశ్చంద్రాదులకి తప్పలేదు. — ఏవిటో మంచేతుల్లో ఉందనుకొని తప్పుదారి పడిపోతున్నావు." అన్నాడు సీతప్ప.

"దారితప్పి ఏదన్నా అయితే నలుగురూ మనని ఆడిపోస్తారేవోనని నా బెంగ. 'అది చిన్న పిల్ల, దానికేంతెలుస్తుంది ? పెద్దవాళ్ళన్నా చెప్పొద్దా ?' అన్నమాట తప్పక పుడుతుంది."

"అదీ బొత్తిగా కొట్టివెయ్యవలసిన మాట కాదనుకో. అంచేత జపంజేద్దాం. అబ్బిని ఇసంటా పిల్చి వాణ్ణి చెప్పమను. ఎంత లేదన్నా మొగుడూ పెళ్లాంగదా ! ఆ అన్యోన్యం మరొకరికి రమ్మంటే మాత్రం వస్తుందా, నీ పిచ్చిగాని !" అన్నాడు సీతప్ప, భార్య అమాయకత్వాన్ని ఓర్పుతో సహిస్తున్నవాడల్లే.

3

"నాయినా, సత్యం ? నువ్వూ ఆయినా జపానిక్కూచోండి. ఈలోపుగా చారు కూడా అయిపోతుంది. వడ్డించేస్తాను", రావమ్మ గారు వంటింటోంచి కేక పెట్టింది.

"జపవా ! హోహోహో !" అని సీతారత్నం కప్పులేచిపోయేలా నవ్వింది.

"వచ్చె ! వచ్చె ! క్షణం !" అంటూ సీతప్పరామకోటి కళ్ళు కద్దుకుని యథాస్థానంలో పెట్టేశాడు. ఆయన వంటింట్లో చేరి ఆచమనంచేసి కేశవనామాలతో సంధ్యావందనం ప్రారంభించాడు. ఆయిన ముక్కుపట్టుకోవడం మానేసి పక్కనున్న ఖాళీపీటకేసి చూసి, "వీడేడీ ? సంధెవార్చడూ ? ఎందుకాలిస్యం ?" అని భార్యను అడిగాడు.

కోడలన్న మాటలూ, నవ్వూ విన్న రావమ్మ మాట్లాడలేదు. ఆవిడ వడ్డించా నన్నదాకా సత్యంగదిలోనుంచి ఇవతలికి రాలేదు. సత్యంతోబాటు సీతారత్నం కూడా వచ్చింది. రెండేవిస్తళ్లూ, రెండే పీటలూ వేసి ఉండటంచూసింది. సత్యంకేసి తిరిగి, "మీకు ఈ పూట భోజనంలేదా ఏవిటి ?" అని సీతప్పగారి పక్కనఉన్న పీటమీద కూచుంది.

సత్యం తల్లికేసి బిక్కమొహంవేసుకు చూశాడు. అందాకా కళ్లుమూసుకు బకధ్యానం చేస్తున్న సీతప్ప కళ్లు పెద్దవిగా తెరచి రావమ్మతో, "అలాచూస్తావేవిటీ ? అబ్బికి పీటా, విస్తరీ వెయ్యి!" అన్నాడు.

రావమ్మగ్రహించిందిగాని అసహాయురాలైపోయింది. ఇంటో మరో పీటచెక్క లేదు.

"మరెండుపీటలు చేయిద్దామనుకుంటూనే తాత్సారమైపోయింది." అన్నది రావమ్మ.

"ఛా, ఛా ! పీటలక్కూడాకరువే ? మాయింటోరెండుడజన్లపీటలు. అయినా మీ అబ్బాయికిపీటమీద కూచోడం అలవాట్లేదు. ఆయనపీటమీదకూచుంది పెళ్లిపీటలమీదే," అన్నదిసీతారత్నం.

"అవునమ్మా, నేను కిందేకూచుంటాను. నాకలవాటైపోయింది," అన్నాడుసత్యం. తల్లిప్రాణంతల్లడిల్లిపోయింది — పిల్లడు పీటలేందే అన్నం తినేవాడుకాడు; అన్నప్రాసనచేసిన్నాడే వాడికోసం ఓ బుల్లిపీట

చేయించారు; అదిచాలకపోతే ఇంకొంచెం పెద్దదీ, అదిచిన్నదైపోతే మరికొంచెం పెద్దదీ; అలాపీటలుచేయిస్తూ వచ్చారు! అత్తారింటఇన్నాళ్లూ వాడికి పీటవెయ్యలేదన్న మాట! ఎన్నిడజన్లపీటలుండేం? ఏడవనా?

రావమ్మతనభర్తకుడిచేతి పక్క మరో విస్తరితెచ్చివేసి వడ్డన ఆరంభించబోయింది. కాని సత్యం విస్తరితోసహాలేచి తన భార్య పక్కనచేరాడు.

''ఇప్పుడన్నాపసిగట్టేవా నీవుచేసినపొరబాటు''అని సీతప్పమందహాసంతో భార్యకేసి చూసి అన్నాడు.

"పొరబాటుజరిగేపోయిందా? ఏవిటండీ అదీ?''

"భార్యాభర్తలమధ్యని మరోరుకూచో వచ్చుటే, వెర్రిదానా?'' అన్నాడు సీతప్ప.

"నిజవేస్మండీ! నా తెలివి తెల్లారా!" అంటూ రావమ్మ వడ్డన ఆరంభించింది.

"ఛీ, ఛీ, ఛీ! ఇదేం పచ్చడీ? కంది పచ్చడా? ఇలా తగలేశా రేవిటీ? మా ఇంటో ఇలా చేస్తే కుక్కలు కూడా ముట్టవు!... ఈ కూర ఇలా తగులడిం దేవిటీ? మీ అబ్బాయికి నచ్చేవంట యిదేకాబోలు. మా తిళ్లూ, మా వంటలూ ఆయనకు పట్టవు, ఇంచేతేనూ!... మా మామ్మ ఈ వంకాయ కూర వెల్లుల్లిపాయ వేసి చేస్తే గిన్నె నాకెయ్యవలిసిందే! అంతబాగా చేసేది" అంటూ అన్నీ తోసేసి, రెండు నిమిషాలైనా విస్తరిముందు కూచోకుండానే చివాల్న లేచేసింది.

ఒక్కముద్ద తిని రెండోసారి కలుపుకో బోతున్న సత్యం కూడా విస్తట్లో చెయ్యి విదిలించి లేచాడు.

"హయ్యో! హయ్యో!'' అని రావమ్మ ఆర్తనాదం చేసింది.

"నింపాదిగా! నింపాదిగా!'' అని సీతప్ప అరచాడు. ఆ మాటకు అర్థమేమిటో ఎవరికీ తెలియలేదు.

"ఆకలి మండిపోతుంది. తినడానికి లేదు. పీడ! ఏ హోటలు కన్నా పోయొద్దాం పదండి!'' అని సీతారత్నం సత్యంతో అనటం వినపడింది.

వాళ్ళిద్దరూ వెళ్ళాక రావమ్మ తన భర్తతో, "ఇదేం విడ్డూరవండి?'' అన్నది.

''అదే పొరబాటు! నువు తొందరపడకు! మరేం భయంలేదు. ఇలా మాట్లాడే వాళ్లంతా విధిగా బోళావాళ్ళు. అది రూలే అనుకో! దానికి మరి తిరుగు లేదు. వాళ్ళ మనసెలా ఉంటుందో తెలుసా? వెన్న! వెన్నకంటె కూడా సున్నితం. మనం మంచిగా ఉంటే, వాళ్ళంత మంచివాళ్ళుండరు. ఈ కిటుకు అబ్బి కనిపెట్టేశాడు. దాన్ని నొప్పించకుండా ఉండటానికీ, మెప్పించటానికీ వాడెలా మసులుకుంటున్నాడో చూశావా? ఓర్పు! ఆఁ! మన కడుపున సామాన్యుడు పుట్టాడనుకున్నావుటే? సాక్షాత్తూ ఆ శ్రీరామచంద్రమూర్తే అవతరించాడు. ఆ రాముడిది ఏం వోర్పు! పితృవాక్య పరిపాలనా మరోటా? చీమలు దూరని చిట్టడవుల్లో, కాకులు దూరని కారడవుల్లో, ఓ చెంప ఆ సీతామ్మవార్ని పంచప్రాణాలుగానున్నూ రక్షించుకుంటూనున్నూ, మరోవంక తమ్ముడు లక్ష్మణుడు ఎక్కడ కందిపోతాడో అని వెయ్యికళ్ళతో కాపాడుతూ, ఎదటపడ్డ రాక్షసుణ్ణల్లా — వధ! — నరికిపారేసుకుంటూ, పద్ధాలుగేళ్ళు అష్టకష్టాలు — ఓ నెలకాదు, ఓ ఏడాదిగాదు, పద్ధాలుగేళ్ళు అష్టకష్టాలూ పడ్డాడంటే ఎంత వోర్పు. ఎంత వోర్పు!" అన్నాడు సీతప్ప. ఆయన ముఖాన చెమటలు దిగ్గారిపోతున్నాయి, నడివేసవిలో లాగా.

రావమ్మ దీర్ఘంగా నిట్టూర్చి భర్తకు చారు వడ్డించింది. ★